పి.వి.బి. శ్రీరామమూర్తి

# గురుశిష్య సంవాదం

"గురూజీ! నా దొక సందేహం!"

"చెప్పు శిష్యా!"

"మానవుడు అంతరిక్షంలో అడుగు పెట్టాడు. ప్రపంచానికి సుదూరంగా ఉండి ధ్వంసం చేయగల బాంబులు కనిపెట్టాడు. చనిపోతున్న మనిషిని మరికొద్ది సేపు ఆపగలిగే మందులు కనిపెట్టాడు. ఒకనాడు ఎవరూ ఊహించని ఆధునిక పరికరాలను కనిపెట్టాడు. ఇన్ని కనిపెట్టినా, ఇంత సాధించినా - మనిషి సాధించాల్సిందీ, తెలుసుకోవలసిందీ ఎంతో మిగిలిపోయిం దంటారు మీరు. చనిపోయిన మనిషిని బ్రతికిం చగలిగే శక్తి, సూర్యమండలం మీద అడుగు పెట్టగలిగే రోజూ మనం చూడలేకపోయినా మన తరువాత తరంవారు చూడగలరనే నమ్మకం ఉంది. కాదంటారా?"

"అవశ్యం! అవశ్యం!"

"అప్పుడైనా మనిషి పరిపూర్ణ ప్రగతిని సాధించగలిగినట్లు అంగీకరిస్తారా?"

గురూజీ పెదాల మీద చిరునవ్వు విరిసింది.

"అంటే... అది పరిపూర్ణ ప్రగతి కాదంటారా?"

"నాయనా! ఈ దేశంలో 'సంపూర్ణ అక్షరాస్యత' సాధించేసాం అని అంటారు చూసావ్, ఇదీ అలాటిదే!... అన్నారు. ఇంతలో-

దభీమనీ చప్పుడు లోపల. శిష్యుడు పరుగెత్తాడు లోనికి.

ధడ్....ధడ్... ఠక్....ఠక్... చప్పుళ్ళు.

మరిన్ని చెంబులు తిరగబడిన చప్పుళ్ళు.



గాజు సామాను బద్దలైన శబ్దాలు. ఇంకేవేవో వస్తువులు గతులు తప్పుతున్న వినికిడి.

పావు గంట తరువాత తిరిగి వచ్చిన శిష్యుడు.

అతని చేతిలో తోక పట్టుకుని తీసుకొచ్చిన అడుగు నిడువు అరంగుళాల మందం కలిగిన పందికొక్కు, తీవ్రవాది చేతిలో హతమైన అమాయక ప్రాణిలా గుడ్లు తేలవేస్తూ.

"రామ... రామ! ఎంత పనిచేసావ్ శిష్యా!"

"అదేంటి గురూజీ అలా అంటారు. పదిరోజులై ఇంటిని, పెరటిని ఇది ఎంత విధ్వంసం చేస్తున్నదో తెలుసా? ముచ్చటగా పెరుగుతున్న నందివర్ధనం మొక్క మొదటిని గోతులు తవ్వి పాడుచేసింది? ఇంట్లో ఏ సామానులనీ ఉంచనివ్వటం లేదు."

"అంతే కదా నాయినా, అది దాని ప్రకృతి. అదేం ఎం.పీ లాడ్స్'ని దుర్వినియోగం

చెయ్యటం లేదు కదా? పార్లమెంటుకో, సచివాలయాలకో గోతులు తవ్వటం లేదు కదా! పనికి ఆహారంగా వచ్చిన బియ్యాన్ని బొక్కలేదు కదా? పిల్లలకి పెట్టమన్న మధ్యాహ్న భోజన పథకపు పదార్థాలను దిగమింగ లేదు కదా? అదేం తప్పు చేసిందని దాన్ని చంపేసావ్? దాని తిరగబడిన గుడ్లు నీకు మనసును కరిగించలేదా?"

శిష్యుడు గురూజీ మాటలు విని గజగజ వణికిపోయాడు. అతని చేతిలో బరువు క్వింటాలంతయినట్లయి 'ఠపీ' మని వదిలేసాడు.

"గురూజీ! చెప్పారు కాదు"

"చెపుతాను."

"రెండు తలలు కలిసి పోయిన శిశువులను ఆపరేషన్ చేసి డాక్టర్లు ఆ బిడ్డలను బతికించి ఒక రికార్డు నెలకొల్పారట. మగాళ్ళను కావాలనుకుంటే ఆడాళ్ళుగా మార్చేస్తున్నారు. ఇంకా మానవుడు సాధించాల్సిన ప్రగతి ఏముందటారు?"

గురూజీ పెదాల మీద మళ్ళీ చిరునవ్వే!

లోపల్నుండి పిల్లలు గోల! 'పాము' 'పాము'!

శిష్యుడు పరుగుతీసాడు. ఠక్..ఠక్... ధడ్...ధడ్...!' శబ్దాలు. అరగంట తరువాత చెమట పట్టి వచ్చాడు. ఒళ్ళంతా చెమట.

"ఏమైంది శిష్యా? ఏమా ఘర్మజలం?"

"పా......పా...... పాము....."

"చంపేసావా?"

"పారిపోయింది!"

"పోనీలే!"

"అదేంటి గురూగారూ, పాము పారిపోయిందంటే పోనీలే అంటారేం? ఇవాళెలా అయినా దాన్ని చంపి తీరుతా. 'గునపాం' తెచ్చి ఆ చెట్టు క్రింద పుట్ట తవ్వి దాన్ని చంపకపోతే అది పగబట్టి మనల్ని కాటేస్తుంది!"

"పొరపాటు శిష్యా! అదేమయినా 'మనోహర్' అనుకున్నావా, అమాయికంగా పరీక్ష రాస్తున్న అమ్మాయిని కాటేయడానికి? లేక అదో విద్యార్థా? కళ్ళుగానని కామంతో గురువమ్మవే బలిగొనటానికి? లేక అదేమన్నా ఉన్మాది, అనుకున్నావా? ప్రపంచానికి అవసరమైన 'సైంటిస్ట్'ల మీద విషజ్వాలలు కుమ్మరించటానికి?"

"అయితే ఏం చేయమంటారు? అది పెరట్లో ఉందన్న భయంతో ఆశ్రమంలో ఎవరికీ నిద్రపట్టి చావదే?"

"ఆ నాగరాజుకు కబురు చెయ్యండి. వాడు దాన్ని పట్టుకుంటాడు. దూరంగా అడవుల్లో విడిచిపెట్టిరండి."

"వాడొట్టి టక్కరి నక్క. మోసగాడు. అసలు వాడే ఈ పాములు విడిచిపెట్టి మళ్ళీ పట్టుకుని డబ్బులు పిండితున్నాడంటారు."

గురూజీ నవ్వారు.

"ఎందుకు గురూగారు నవ్వుతున్నారూ? వాణ్ణి నక్కంటే తప్పా?"

"నక్కంటే తప్పు అని కాదు. 'నక్క'ని మోసానికి ప్రతీకగా మనం వాడటం తప్పు.

"దాని ఆహార సంపాదన కోసం అది అమాయకంగా నటిస్తుంది. అది భగవంతుడు దానికిచ్చిన వరం "ఆయుధం". ప్రజలకు అందుబాటులో లేని అవకాశాలు అందిస్తాం అనే రాజకీయ నాయకుల్లాటివి కాదు కదా? తన స్థానాన్ని వదిలం చేనుకోటానికి ఆనందంగా కలిసున్న వాళ్ళలో చిచ్చుపెట్టి -

వాళ్ళని విడగొట్టడానికి ప్రయత్నం చేయ్యలేదు కదా? నన్ను గెలిపిస్తే మీ కాలయాలు కట్టిస్తానని ఆ తరువాత వాటిని మరిచిపోయే నైజం దానికి లేదు కదా? ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బతీయడానికి విధ్వంసవాదులతో అదేం చేతులు కలపలేదు గదా? ఏ సన్యాసినీ చెరసాలకు పంపిన దాకా నిద్రపోక అహోరాత్రాలు కుయుక్తులు పన్నటం లేదు కదా?''

''గురూజీ, ఒప్పుకుంటాను. మరి 'లోకులు కాకులు' అంటారు దీన్నేమంటారు

''అదీ తప్పేనాయన కాకులు వేకువ సూచకంగానూ సాయం సంధ్యా సూచకంగానూ అరుస్తాయి. వారి అరుపులు వల్ల మనకు నష్టం కానీ, కష్టం గానీ ఏమీ లేదు కానీ ఈ మనుషులున్నారు చూసావు? వీళ్లెందుకరుస్తారో, ఎలా అరుస్తారో వీళ్ళకే తెలీదు. తమకు పడని వాళ్ళ మీద లేనివన్నీ కల్పించి ప్రళయాన్ని సృష్టిస్తారు. కాకులు అలా చెయ్యవు కదా? అంతేకాదు, ఒక కాకి చనిపోతే తక్కిన కాకులు ఆహారానికైనా పోవు. అన్నీ సమావేశమై విచారాన్ని తెలియచేస్తాయి. ఒక మనిషి రోడ్డు మీద చచ్చిపడి ఉంటే మన మనుషులు చూసి పోతారేగానీ అతను చనిపోటానికి కారణం ఏమిటి? అతనెవరూ అని ఎంత మంది ఆలోచిస్తున్నారు?''

''అయితే గురూజీ, మనిషి కంటే నోరులేని ఈ జీవాలే మెరుగంటారా?''

"ముమ్మాటికీ!"

"అయితే, మీరు చెప్పిన దాన్నిబట్టి పందికొక్కుని చంపకూడదు, పామును చంపకూడదు, నక్కనీ, కాకుల్నీ... ఇంకా ఈ సృష్టిలో ఏ మానవేతర జీవినీ చంపటంకానీ, ఆడిపోసుకోవటం కానీ తప్పంటారు. మరేం చెయ్యమంటారసలు?''

"విషయానికొచ్చావు. ఈ ప్రశ్న నాకు నచ్చింది. భగవంతుడు సృష్టించిన ఈ జీవులన్నీ మనిషిలో ఉన్నవే.''

''ఏంటీ? పందికొక్కూ, పామూ... ఇవన్నీ...''

"అవున్నాయినా? పందికొక్కుని చూసిన మనిషి తనకు కాని సొమ్ముకు కన్నం వెయ్యకుండా తనలోని పందికొక్కుని చంపుకోవాలి!పాములని చూసినపుడు తనలోని కామం పడగవిప్పకుండా జాగర్తపడాలి. నక్కని 'టక్కరి నక్క' అనే ముందు తనలోని వంచనను. ఈర్ష్యా సూయల్నీ హతమార్చుకోవాలి. సాధుజంతువులైన క్షీరదాలను చూసినపుడు తాను వాటిలాగా సమాజానికి ఉపయోగపడాలని తెలుసు కోవాలి!''

"సరే గురూజీ, చివరి ప్రశ్న. పందివల్ల ఏం నేర్చుకోవాలంటారు?''

"చక్కని ప్రశ్న వేసావ్ నాయినా! పంది దాని శరీరాన్నది పాడుచేసుకుంటుంది. ఇతరులను పాడు చెయ్యదు. అది తెలుసుకొని మనిషి ప్రవర్తిస్తే చాలు!''

ధన్యోస్మి గురూజీ!''